# చావు లేని చదువు చదువవలయు

సంస్కారమే లేని చదువెంత ఉండినా
కలిగించునే మీకు గౌరవంబు?
నీతియే లేకున్న నియమంబు లేకున్న
కలుగునే మీకిల గౌరవంబు?
హద్దులు మీరిన అధికార బలమున్న
కలుగునే ఇలలోన ఘనత మీకు?
ధర్మమార్గము వీడి ధర్మంబు బోధింప
మర్యాద నిత్తురే మహిని మీకు?

పాపభీతియె లేకుండ బాల్యమందు
తప్పు పనులను చేయుట తప్పుతప్పు
ఇంతకన్నను వేరెద్ది ఎఱుకపరతు?
సాధుసద్గుణ గణ్యులౌ సభ్యులార!

ప్రేమస్వరూపులారా! ఈనాడు భూమిని పరిశోధించి చూసిన... జలము అట్టడుగునకు దిగిపోవుచున్నది. రాజకీయ పరిస్థితులను విచారణ చేసి చూసిన... నీతినిజాయితీలే శూన్యమైపోతున్నవి. మానవత్వమును చూసిన.. మానవతావిలువలు అదృశ్యమైపోయినవి. ప్రాచీనకాలమందు త్యాగరాజులు, యోగరాజులు, యతిరాజులుగా కీర్తింపబడిన అధ్యాపకులు ఈనాడు భోగరాజులుగా, కామరాజులుగా మారిపోవుచున్నారు. అనాది కాలమునుండి భారతీయులు ఆధ్యాత్మికతత్త్వ ప్రభావంచేత తాము ఆనందాన్ని అనుభవించటమే గాక, ఆ ఆనందాన్ని అందరికీ పంచిపెడుతూవచ్చారు. కాలముచే మారక, చరిత్రచే మాయక, ప్రళయముచే తరగక, సృష్టిచే పెరగక ఏ సత్యమైతే ఉన్నదో ఆ సత్యమునకు రూపకల్పనయే మన ప్రాచీన సంస్కృతి. ఇట్టి నిత్యసత్యమైన సంస్కృతిని విస్మరించి, భౌతికమైన వాంఛలతో తాత్కాలికమైన తృప్తికోసం ప్రాకులాడుతున్నాడు నేటి మానవుడు. తన విలువను తాను

sri sathyasai vachanamrutam

గుర్తించుకోలేక జీవితాన్ని వ్యర్థం చేసుకుంటున్నాడు. ధనమునకు విలువనిస్తున్నాడే గాని, గుణమునకు విలువనివ్వటం లేదు. తాను అనేక ఘనకార్యములను సాధిస్తున్నాడుగాని, ఆత్మానందమును మాత్రం సాధించలేకపోతున్నాడు. ఆత్మానందమును సాధించే నిమిత్తమే తనకు మానవజన్మ ప్రాప్తించిందనే సత్యాన్ని గుర్తించుకోలేకపోతున్నాడు.

మనిషిని ఆంగ్లంలో Man అన్నారు. దీని అంతరార్థమేమిటి? M - మాయను త్యజించాలి, A - ఆత్మను దర్శించాలి, N - నిర్వాణమును పొందాలి. ఇదే MAN అనే పదముయొక్క అంతరార్థం. మానవుడు తన జీవితలక్ష్యమేమిటి? అనే ప్రశ్నకు జవాబును తెలుసుకోలేకపోతున్నాడు. ఈ ప్రశ్నకు జవాబును తెలుసుకుంటే జగత్తులో సర్వమునూ తెలుసుకున్నవాడవుతాడు. మానవుని యందు విజ్ఞాన, సుజ్ఞాన, ప్రజ్ఞానములు నిండియున్నవి. కాని, మానవుడు తనకు దూరంగా ఉన్న అజ్ఞానమునే వరిస్తున్నాడు గాని, తనయందే ఉన్న జ్ఞానతత్త్వమును విచారణ చేయటం లేదు. కనుకనే, నేడు మనం మానవతా విలువలను ప్రచారం చేయవలసిన అవసరం ఏర్పడింది.

**ప్రభావం - స్వభావం**

ఈనాటి మానవుడు ప్రభావానికి లొంగి తన స్వభావాన్ని మరచి జీవితాన్ని మట్టిపాలు చేసుకుంటున్నాడు, ప్రభావమనగా ప్రారబ్ధమనే చెప్పవచ్చును. ప్రారబ్ధంయొక్క నిర్మూలనయే మానవుని స్వభావం. స్వభావమనగా మానవతాగుణములు, మానవుని సహజ ధర్మములు. "స్వ - భావం" అనగా ఆత్మభావమే స్వభావం. ఆత్మభావములే సత్య, ధర్మ, శాంతి, ప్రేమలు. ఇవి మానవునితోపాటు ఆవిర్భవించినవేగాని, మానవుని తరువాత పుట్టినవి కాదు. ఇట్టి స్వభావాన్ని మరచిపోవటంచేతనే మానవుడు కల్పితమైన ప్రభావానికి లొంగి పేరుప్రతిష్ఠలకోసం, ధన, కనక, వస్తు, వాహనాదులకోసం ప్రాకులాడుతున్నాడు. గుణముపోతే పోనీ, మానవతాధర్మము ఏమైనా కానీ, ధనముంటే చాలని భావిస్తున్నాడు. ధనముకూడా ఉండవలసిందే. అయితే, ధర్మార్థకామమోక్షములనే చతుర్విధ పురుషార్థములలో ధర్మము తరువాతిదే అర్థము. కాని ఈనాటి మానవుడు ధర్మమును విస్మరించి, అన్యాయంగా, అక్రమంగా, అధర్మంగా ధనమును సంపాదించటానికి ప్రయత్నిస్తున్నాడు.

srisathyasaivachanamrutam

ప్రేమస్వరూపులారా! మీరు ధర్మార్థకామమోక్షములనే చతుర్విధ పురుషార్థములను వేరువేరు చేయటంచేతనే మిమ్మల్ని ప్రారబ్ధం పట్టిపీడిస్తున్నది. ఈ నాల్గింటిని మీరు రెండుగా మార్చుకోవాలి. అప్పుడే మీరు ప్రారబ్ధమనే ప్రభావానికి లొంగకుండా ఉండగలరు. ధర్మార్థములను రెండింటినీ ఏకం చేయాలి, కామమోక్షములను రెండింటినీ ఏకం చేయాలి. అనగా, అర్థమును ధర్మమార్గంలో సాధించాలి; మోక్షాపేక్షను పెంచుకోవాలి. కాని, మీరు మోహాపేక్షకు లోనై ప్రారబ్ధానికి గురి అవుతున్నారు.

**ఆనందానికి ఆత్మవిశ్వాసమే తొలిమెట్టు**

మానవునికి ఆనందం కావాలి. ఆనందానికి మార్గమేమిటి? ఎలాంటి ఆనందం కావాలి? ఈ ప్రపంచంలోని వస్తువులవలన కలిగే ఆనందమా? కాదు, కాదు. అది తాత్కాలికమైనది. ఆనందం కావాలంటే మొట్టమొదట ఆత్మవిశ్వాసాన్ని అభివృద్ధి పరచుకోవాలి. ఆత్మవిశ్వాసంచేత ప్రేమ లభ్యమౌతుంది. "ఈమె నా తల్లి" అని విశ్వసించటం చేతనే బిడ్డ తల్లిని ప్రేమించగల్గుతున్నది. "ఇతను నా భర్త" అనే విశ్వాసంవల్లనే భార్య భర్తను ప్రేమించగల్గుతున్నది. కనుక విశ్వాసమున్నప్పుడే ప్రేమ ఆవిర్భవిస్తుంది. ప్రేమ ఆవిర్భవించినప్పుడే శాంతి ప్రబలుతుంది. శాంతికోసం పూజలు, వ్రతాలు చేయనక్కర్లేదు. వాటివలన శాంతి లభ్యం కాదు. అనేకమంది లోకశాంతికోసం వ్రతాలు చేస్తున్నామంటారు. అదంతా పక్కా "స్టంట్!" శాంతి ఎక్కడో లేదు, ప్రేమయందే ఇమిడియున్నది. విశ్వాసమువలన ప్రేమ, ప్రేమవలన శాంతి, శాంతివలన సత్యము లభిస్తాయి. సత్యమెక్కడో దైవమక్కడ. ఎందుకంటే, సత్యమే దైవస్వరూపం! దైవమెక్కడో ఆనందమక్కడ, కనుక, ఆనందమునకు మొట్టమొదట కావలసింది ఆత్మవిశ్వాసం. కాని, ఈనాటి మానవునికి ఆత్మవిశ్వాసమే లేదు. అనిత్యమైనవాటిపై విశ్వాసం పెరిగిపోతున్నదిగాని, నిత్యసత్యమైన దైవంపై విశ్వాసం కుదరటం లేదు. దైవంపట్ల సందేహాలకు ఏమాత్రం అవకాశమివ్వకూడదు. మీరు దైవాన్ని మాత్రమే నమ్మాలి, ఇంకెవ్వరినీ నమ్మకూడదీ లోకంలో.

**ఆనందము మీయందే ఉన్నదని గుర్తించండి**

కనిపించేవన్నీ ఏదో ఒకనాటికి అంతర్ధానమైపోతాయి. శాశ్వతమైన సత్యము ఒక్క

sri sathyasaivachanamrutam

ఆనందమే. అట్టి మార్పు చెందని ఆనందమును అనుభవించే వాడే మానవుడు. బుద్ధుడు నిర్వాణస్థితికి సిద్ధంగా ఉన్న సమయంలో అతని పినతల్లి కుమారుడైన ఆనందుడు ఆ దృశ్యాన్ని చూసి కన్నీరు కార్చాడు. అప్పుడు బుద్ధుడు "పిచ్చివాడా! ఎందుకు నీవు దుఃఖిస్తున్నావు? నాకు నిర్వాణం లభిస్తున్నదని నీకు దుఃఖమా? నిర్వాణమే మానవునియొక్క అంత్య సత్యము. అట్టిదానిని మనం కోరి పొందాలిగాని, దానికి దుఃఖించటం పొరపాటు. మాయను త్యజించు, ఆత్మను దర్శించు, నిర్వాణము పొందు" అని బోధించాడు. ప్రేమస్వరూపులారా! మీరీనాడు చేయవలసింది యజ్ఞయాగాది క్రతువులు కాదు, జపతపాది సాధనలు కాదు. మొట్టమొదట ఆనందం మీయందే ఉన్నదనే సత్యాన్ని గుర్తించాలి. అది "నిర్గుణం, నిరంజనం, సనాతనం, నికేతనం, నిత్య, శుద్ధ, బుద్ధ, ముక్త, నిర్మలస్వరూపిణం."

వేదము "సర్వం ఖల్విదం బ్రహ్మ" "సర్వం విష్ణుమయం జగత్" అని బోధిస్తున్నది. అంతా బ్రహ్మస్వరూపమే. ప్రతి వ్యక్తీ, ప్రతి పదార్థమూ, ప్రతి స్థానమూ భగవత్స్వరూపమే. వేదములో ఉన్న ఇట్టి పవిత్రమైన భగవద్వాక్యము లను అర్థం చేసుకోవాలంటే మీలో సద్గుణములు అభివృద్ధికావాలి. మొట్ట మొదటిది సత్యము. సత్యమంటే కేవలం వాక్కునకు మాత్రమే సంబంధించినదని మీరు భావిస్తున్నారు. ఇది చాలా పొరపాటు. "త్రికాలాబాధ్యం సత్యం" మూడు కాలములందు మార్పు చెందనిదే సత్యం. అదే దైవం. ధర్మమనగా ఏమిటి? దానం చేయటం, యజ్ఞయాగాది క్రతువులనాచరించటం... ఇవి కేవలం సత్కర్మలు మాత్రమే. హృదయంనుండి ఆవిర్భవించిన సత్యాన్ని ఆచరణలో అనుభవించటమే ధర్మము. "ధారయతీతి ధర్మః" మనకు ఆధారమైనదే ధర్మము. శాంతి అంటే ఏమిటి? నిర్వాణసమయంలో మానవుడు ధరించే కిరీటమే శాంతి. మీరు శాంతి కావాలని ఆశిస్తున్నారు. శాంతి ఎక్కడుంది? మీయందే ఉన్నది. "నేనే శాంతిస్వరూపుడను. అంతా నేనే" అని మీకు మీరు గుర్తు చేసుకోవాలి. ఆత్మతత్త్వాన్ని విశ్వసించకపోతే మీరెన్ని చదువులు చదివినా ప్రయోజనం లేదు.

**చదులన్ని చదివి చాల వివేకియై**
**మదిని తన్నెఱుగడు మందమతుడు**
**ఎంత చదువు చదివి ఏరీతి నున్నను**
**హీనుడవగుణంబు మానలేడు**

sri sathyasai vachanamrutam

**తరచి చదువు చదువ తర్కవాదమెకాని**
**పూర్ణజ్ఞాన మెపుడు పొందలేడు**
**చదువులన్ని చదివి చావంగ నేటికి?**
**చావు లేని చదువు చదువవలయు**

మీరెన్నో సబ్జెక్టులను చదువుతున్నారు, ఎన్నో పరిశోధనలు చేస్తున్నారు. ఇదంతా స్వార్థంకోసమే గాని, లోకక్షేమంకోసం కాదు. లోకక్షేమం, లోకశాంతి కావాలంటే పవిత్రమైన కర్మలనాచరించాలి, తోటిమానవుణ్ణి ప్రేమించాలి. హృదయంనుండి ఆవిర్భవించే సత్య, ధర్మ, శాంతి, ప్రేమలను ఆచరణలో పెట్టకుండా కేవలం అక్షరాల్లో చెప్పుకుంటే లాభం లేదు.

ఈనాడు జగత్తులో మూడు విధములైన మార్పులు అత్యవసరం. మొదటిది Spiritual change (ఆధ్యాత్మిక మార్పు), రెండది Association change (సామాజిక మార్పు), మూడవది Individual change (వ్యక్తిగత మార్పు). SAI (సాయి) చేసే పనులన్నీ వీటికి సంబంధించినవే. ఇంతేగాక, SAI అనే పదములో S అనగా, Service (సేవ), A అనగా Adoration (ఉపాసన), I అనగా, Illumination (జ్ఞానము). అనగా, కర్మోపాసన జ్ఞానములను బోధించటమే సాయితత్త్వం.

**ఆదర్శవంతమైన కాన్ఫరెన్సు**

ఈనాడు సత్యసాయి బాలవికాస్ గురువులు ఇన్ని వేలమంది ఇక్కడ చేరారు. బయట అనేక చోట్ల అనేక కాన్ఫరెన్సులు జరుగుతుంటాయి. అక్కడ పదివేలమంది డెలిగేట్లు వస్తే అందులో సగంకూడా సమావేశాల్లో ఉండరు. కాని మన కాన్ఫరెన్సు అలాంటిది కాదు. డెలిగేట్లందరూ ఎంతో ఉత్సాహంగా పాల్గొంటున్నారు. నాకు అన్నీ తెలుసు. అయినప్పటికీ తెలియనట్లుగా వెనుక నుండి చూస్తుంటాను, పైనుండి చూస్తుంటాను – ఎవరైనా కదులుతున్నారా? లేచిపోతున్నారా? అని. ఎవ్వరూ కదలటం లేదు. అయితే కొంతమంది శారీరకమైన ఇబ్బందులచేత లేచిపోతున్నారుగాని, అయిష్టంతో ఎవ్వరూ లేచిపోవటం లేదు. అందరూ చాలా భక్తిశ్రద్ధలతో కాన్ఫరెన్సులో పాల్గొంటున్నారు. ఇలాంటి కాన్ఫరెన్సులు సంవత్సరమునకు ఒకతూరి కాదు, మూడు పర్యాయములు జరగాలి. ఇంకా ఎక్కువమంది

sri sathyasai vachanamrutam

సభ్యులను తయారుచేయాలి. వారికి నూతనమైన పద్ధతులను బోధించాలి. అప్పుడే ఇది ప్రపంచమంతా వ్యాప్తి చెందుతుంది.

మన ప్రైమ్ మినిష్టరు వాజ్‌పేయి ఒక జాబు వ్రాసి ఇందులాల్‌షాద్వారా పంపించాడు. “స్వామీ! మా గవర్నమెంటుకూడా ఇలాంటివేమీ చేయలేదు. మీకు తప్ప ఇంకెవ్వరికీ ఇది సాధ్యం కాదు. మీరింకా ఎక్కువ బాధ్యతలు వహించి గవర్నమెంటు తరపున కూడా ఇలాంటివాటిలో ప్రవేశించాలి” అని కోరాడు. వారేమో పాపం ప్రేమతో ఇలా వ్రాస్తున్నారు. కాని వారు ప్రేమతో వ్రాశారని మేము గవర్నమెంటు పనులలో ప్రవేశించకూడదు. ఎందుకంటే వారి స్వభావాలు వేరు, వారి ప్రభావాలు వేరు; మా ఆనందం వేరు, మా ఆచరణ వేరు, మా అనుభూతులు వేరు. కాబట్టి మా పనులను మేమే చూసుకుంటాము. ఇక్కడెన్నో సమావేశాలు జరుగుతున్నాయి. కాని ఎక్కడా చందాలు వసూలు చేయటం లేదు. ఎవరి తిండి వారు తింటున్నారు; ఎవరి సౌకర్యాలను వారు చూసుకుంటున్నారు; అందరూ హృదయపూర్వకమైన ఆనందాన్ని అనుభవిస్తున్నారు.

## మాటలు తగ్గించి పని ఎక్కువ చేయాలి

ఈనాటి విద్యార్థుల ప్రభావం చాలా విపరీతంగా మారిపోతున్నది. గొప్పగొప్ప చదువులు చదువుతున్నారు, డాక్టర్లు అవుతున్నారు, ఇంజనీర్లు అవుతున్నారు. కాని పనిలో ప్రవేశించటం లేదు. డిగ్రీలు తీసుకున్న తక్షణమే విదేశాలకు వెళ్ళటానికి వీసాకోసం ప్రయత్నిస్తున్నారు. ఇంకెందుకీ చదువులు? ఈ కలికాలపు చదువులన్నీ కలుషితమైన చదువులుగా మారిపోతున్నాయి. ఈనాటి విద్యార్థులు అన్నీ తెలుసుకుంటున్నారు. కాని ఆచరణలో పెట్టటం లేదు. కొంతమంది “స్వామికి అన్నీ తెలుసు. స్వామి ఏది చెప్పినా నా మంచి కోసమే” అంటారు. కాని స్వామి ఆజ్ఞను శిరసావహించరు. స్వామి ఏది చెప్పినా మీ మంచికోసమే అనుకున్నప్పుడు స్వామి ఆజ్ఞను ఎందుకు శిరసావహించకూడదు? మీరు ఏది చెబుతారో అది చేయాలి. మీరందరూ బాలవికాస్ టీచర్లుగా ఉన్నారు. అయితే టీచర్లు మొట్టమొదట మంచి స్టూడెంట్లుగా ఉండాలి. ఒక విద్యార్థి చెడిపోతే అతను మాత్రమే నష్టపోతాడు. కాని ఒక టీచరు చెడిపోతే అతనితోపాటు అనేకమంది విద్యార్థులుకూడా చెడిపోతారు. కనుక టీచర్లు చాలా జాగ్రత్తగా

sri sathyasai vachanamrutam

ఉండాలి.

మీరీ కాన్ఫరెన్సుకు వచ్చింది కేవలం అటెండెన్స్ వేసుకోవటానికి కాదు. ఇక్కడ చూచినవి, అనుభవించినవి బయటకు పోయి ప్రచారం చేయాలి. మీరు వేదికపై ఉపన్యాసాలివ్వటంలో హీరోలుగా ఉండి, ఆచరణలో జీరోలుగా ఉంటే ప్రయోజనమేమిటి? ఆచరణలో కూడా మీరు హీరోలుగా ఉండాలి. ఇక్కడ మీరెంతో ఆనందాన్ని అనుభవించారు. మీరు అనుభవించిన ఆనందాన్ని అందరికీ పంచాలి. మాటలను తగ్గించి, పనిని పెంచుకోవాలి. TALK LESS, WORK MORE. నేను పది దినములనుండి ఎవరితోనూ ఎక్కువగా మాట్లాడటం లేదు. కారణమేమిటి? నేను పిల్లలందరికీ మాటలు తగ్గించమని చెబుతున్నాను. "మాకు తక్కువగా మాట్లాడమని చెప్పి స్వామియే ఎక్కువగా మాట్లాడుతున్నారే" అని కొందరు అనుకోవచ్చు. కనుక నేనుకూడా తక్కువగానే మాట్లాడుతున్నాను. నాకోసం కాదు, మీకు నేర్పటం కోసమే. మితభాషణంలో అమితమైన ఆనందమున్నది. మన ఆనందం బయటినుండి రావటం లేదు, మననుండియే వస్తున్నది. మన లోపలున్న ఆనందమే బయట ప్రతిబింబిస్తున్నది.

మీ దృష్టికి కొందరు మంచివారుగా, కొందరు చెడ్డవారుగా కనిపిస్తుంటారు. కాని నిజంగా చెడ్డ వారెవ్వరూ లేరు. ఎదుటి మనిషి చెడ్డవాడంటే... మీ చెడ్డయే అతనియందు ప్రతిబింబిస్తున్న దన్నమాట. ఈ సత్యాన్ని మీరు అర్థం చేసుకుంటే మీరు ఎవ్వరినీ చెడ్డవారుగా భావించరు. జగత్తులో మీకు కనిపించేదంతయు మీ అంతర్భావముయొక్క "రిఫ్లెక్షన్, రియాక్షన్, రీసౌండ్"లు మాత్రమే. కనుక అందరితోనూ మీరు మంచిగా ఉండాలి, అందరినీ ప్రేమించాలి. ఎట్టి పరిస్థితిలోనైనా మీ స్వభావమును విస్మరించకూడదు.

**దేహాభిమానమును వీడినప్పుడే ఆత్మదర్శనం**

ప్రేమస్వరూపులారా! ఈ కాన్ఫరెన్సులో అనేకమంది పెద్దలు వారివారి అనుభూతులను ఆధారంగా చేసుకొని మీకు అనేక విషయాలను బోధించారు. నేను వింటూనే ఉన్నాను. వారు బోధించిన విషయాలను మీరు ఆచరణలో పెట్టి, ఇతరులకుకూడా బోధించటానికి ప్రయత్నించాలి. నేను చెప్పేది ఒక్కటే. మీరు మానవులై పుట్టినందుకు మాయను దూరం చేసుకోవాలి. ఆత్మను దర్శించాలి, నిర్వాణము పొందాలి. ఆత్మ ఎక్కడుంది? అది మీ స్వరూపమే.

srisathyasaivacharamrutam

కాని మీరు భౌతికమైన దేహమే మీ స్వరూపమని భావిస్తున్నారు. దేహం మీరు కాదు. దేహం నీటిబుడగవలె క్షణభంగురమైనది. మనస్సు ఒక పిచ్చికోతివంటిది. అంతరాత్మయే మీ నిజస్వరూపం. కాబట్టి అంతరాత్మను అనుసరించండి. ఆత్మదర్శనమంటే ఏమనుకుంటున్నారు? ఆత్మను దర్శించాలంటే మీరు ఎక్కడికో పోనక్కర్లేదు. బహిర్దృష్టిని అంతర్దృష్టిగా మార్చుకోవాలి; అప్పుడే దివ్యమైన ఆత్మస్వరూపాన్ని దర్శించటానికి వీలౌతుంది.

ఒక వ్యక్తి మరొక వ్యక్తిని దూషిస్తున్నాడు. దూషింపబడే వ్యక్తియొక్క స్నేహితుడు వచ్చి "నిన్ను వాడంతగా దూషిస్తుంటే నోరు మూసుకుని కూర్చున్నావే! రెండు వేయకూడదా?" అన్నాడు. అప్పుడతను "పిచ్చివాడా! ఎవరు ఎవరిని దూషిస్తున్నారు? దూషించే దేహంలోనూ, దూషింపబడే దేహంలోనూ ఉన్నది ఒకే ఆత్మయే. కాబట్టి అతడు తనను తానే దూషించుకుంటున్నాడు. ఇంక నాకెందుకు కోపం?" అన్నాడు.

ఈ ప్రపంచంలో ఎవరు ఎవరిని ప్రేమిస్తున్నారు? ఎవరు ఎవరిని ద్వేషిస్తున్నారు? మానవుడు ఎవరిని ప్రేమించినా తనను తాను ప్రేమిస్తున్నట్లే, ఎవరిని ద్వేషించినా తనను తాను ద్వేషిస్తున్నట్లే. పరులనేవారే లేరు. ఎందుకంటే, పరులలో ఉన్నదికూడా తానే! దేహాభిమానం చేతనే మానవుడు తనను తాను ప్రత్యేకంగా భావించుకుంటున్నాడు. దేహాభిమానమున్నంతవరకే 'పరులు' అనే భావముంటుంది. దేహాభిమానమును త్యజిస్తే పరులనేవారుండరు, అందరూ ఒక్కటే. ఇదే ఆత్మదర్శనం! ఆత్మకు ఒక ప్రత్యేకమైన రూపం లేదు. ఆనందమే ఆత్మ, చైతన్యమే ఆత్మ. ఇట్టి ఆత్మతత్త్వమును అర్థం చేసుకోవాలంటే సేవలో ప్రవేశించాలి. చేతనైనంతవరకూ అందరికీ సహాయం చేయాలి. సేవలోనే నిజమైన ఆనందమున్నది.

మీరు భగవదనుగ్రహం కావాలని ఆశిస్తున్నారు. అయితే దానికోసం మీరు చేయవలసిన ప్రయత్నమేమిటి? ఒక చిన్న ఉదాహరణ: మీరు బాగా కష్టపడి డబ్బు సంపాదించి బ్యాంకులో డిపాజిట్ చేశారనుకోండి. మీరు తిరిగి ఆ డబ్బును పొందాలంటే చెక్కుపైన సంతకం పెట్టి ఇవ్వాలి. అదేరీతిగా అనేక జన్మలనుండి మీరు ప్రోగుచేసిన పుణ్యమును భగవంతుని 'బ్యాంకు'లో భద్రంగా డిపాజిట్ చేశారు. ఆ 'డబ్బు'ను తిరిగి పొందాలంటే మీరు త్యాగమనే చెక్కుపై ప్రేమ

sri sathyasai vahini amrutam

అనే సంతకం పెట్టి భగవంతుడనే 'బ్యాంకు మేనేజరు'కు అర్పించాలి.

**ఈ ఒక్కటి తెలుసుకుంటే చాలు**

ప్రేమస్వరూపులారా! గడచిన రెండు రోజుల్లో నేను మీతో మాట్లాడలేదని మీకు బాధ కల్గియుండవచ్చును. కాని, నేను మీవెంటనే ఉండి మీ విషయాలన్నీ వింటున్నాను. నాకు ఎవరిపైననూ కోపంగాని, విసుగుగాని లేదు. అయితే, "వీళ్ళు ఎంత చెప్పినా వినటం లేదే! ఇంక ఏవిధంగా బాగుపడతారు? వీళ్ళతో ఎంత మాట్లాడినా ఏమి ప్రయోజనం?" అని మనస్సుకు కష్టమనిపిస్తోంది. అంతేగాని నాకు కోపం లేదు. ఈ సత్యాన్ని కొందరు గుర్తించలేకపోతున్నారు. కారణమేమిటి? వారి బుద్ధి అల్పమైనది, నా భావము అనంతమైనది. అల్పబుద్ధికి అనంతమైన భావమేరీతిగా అర్థం కాగలదు? ఆధునిక చదువులు అధ్వానమైన చదువులుగా మారిపోతున్నాయి. ఈ చదువులవల్లనే మనస్సులో మాలిన్యం పెరిగిపోతున్నది. మనస్సు కలుషితమైనప్పుడు మానవుడు ఏరీతిగా బాగుపడగలడు? ఎంత చదువు చదివినా, ఎన్ని పదవులనేలినా, ఎంత గొప్ప పేరు సంపాదించినా తెలుసుకోవలసినది తెలుసుకోలేకపోతే అవన్నీ వ్యర్థమైపోతాయి. ఈ ప్రపంచంలో మీరు శాంతి సౌఖ్యాలతో బ్రతకాలనుకుంటే "నేను ఆత్మ స్వరూపుడను, అందరూ ఆత్మస్వరూపులే!" అని తెలుసుకుంటే చాలు. ఈ ఒక్కటి తెలుసుకుంటే మీకు అంతా మంచియే జరుగుతుంది. ఈ సూక్ష్మమైన రహస్యాన్ని మీరు గుర్తించుకోలేక పోవటంచేతనే దుఃఖానికి గురి అవుతున్నారు.

మానవునికి ఏది ప్రధానమో, ఏది గమ్యమో, ఏది సత్యమో, ఏది ఆనందమో దాన్నిగురించి రేపు చెబుతాను.

**(04-07-2001 ఉదయం సాయికుల్వంత్ సభామండపంలో శ్రీవారు అనుగ్రహించిన దివ్యసందేశము)**

sri sathyasaivachanamrutam